క్లుప్తంగా

స్పీకర్‌ను కలిసిన శామ్యూల్



తమ్మినేని సీతారాంను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న శామ్యూల్ అరుణ్‌కుమార్

ఆమదాలవలస: స్పీకర్, ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాంను రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వ్యవహారాల ఎలక్షన్ కోఆర్డినేటర్ శామ్యూల్ అరుణ్‌కుమార్ శనివారం ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శామ్యూల్‌కు స్పీకర్ అభినందనలు తెలిపారు. స్పీకర్ మాట్లాడుతూ క్రిష్టియన్ మైనారిటీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేకూర్చిన లబ్ధిని వివరించాలన్నారు. బాధ్యగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయాలన్నారు. మైనార్టీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి ఆసీర్ కుమార్, పాస్టర్‌లు కృపావరం, రవీంద్ర బాబు, సంపత్ కుమార్, అరుణ్ రాజ్, పవన్ గౌతమ్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకుడు దిగంబర్ పి.ప్రధాన్

పాతపట్నం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలు భద్రపర్చే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఉండాలని జిల్లా పరిశీలకుడు (పోలీస్) దిగంబర్ పి.ప్రధాన్ అన్నారు. పాతపట్నం మార్కెట్ యార్డ్ ఆవరణలోని గొదాం వద్ద ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం సాయంత్రం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై సీఐ నల్లిసాయిని అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టూ పరిశీలించారు. ఒడిశా-ఆంధ్ర సరిహద్దు ప్రాంతం కావడంతో స్ట్రాంగ్ రూమ్‌లకు సీసీ కెమెరాలతో మోనటరింగ్, 24 గంటలూ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్ఐలు మహమ్మద్ యాసిన్, అక్షయ్‌కుమార్ ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



పాతపట్నం: పాతపట్నం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.ఈ.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పాతపట్నం కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. కార్యదర్శిగా జి.రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా వై.చంద్రభూషణరావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.రమణ, కోశాధికారిగా యు.దాలయ్య, గ్రంథాలయ కార్యదర్శిగా బి.వి.నాయుడు, సంస్కృతిక కార్యదర్శిగా సి.హెచ్.రామకృష్ణతోపాటు పది మంది సభ్యులుగా ఎన్నుకున్నారు.. ఎన్నికైన బార్ సభ్యులను కోర్టు సిబ్బంది అభినందించారు.

2,800 లీటర్ల సారా ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని జోడూరు పంచాయతీ అచ్చనాపురం గ్రామంలోని కొండ ప్రాంతంలో సారా తయారీ స్థావరాలపై టెక్కలి, పలాస ఎస్ఈబీ, డీటీఎఫ్ పోలీసులు శనివారం ఉదయం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2800 లీటర్ల పులిసిన బెల్లం ఊట ధ్వంసం చేశారు. 70 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్ నాయుడు తెలిపారు. వినియోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడుతో పాటు పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్ర కుమార్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు




అవగాహన కల్పిస్తున్న ఐసీ వేణుగోపాలరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలో శనివారం రాత్రి ఎన్నికల నియమావళి పై ఓటర్లకు కొత్తూరు సీఐ ఆర్.వేణుగోపాలరావు అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఎటువంటి వివాదాల జోలికి పోవద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓట్లు వేసుకోవాలని కోరారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు, సారా రవాణా వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తూరు ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ పాల్గొన్నారు.

రైతులకు ల్యాబ్‌దాయకం!





శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

ప్రజలకు అన్నం పెట్టే రైతన్నలకు అన్ని విధాలా అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. అందులో భాగంగా వైఎస్సార్ సమగ్ర వ్యవసాయ పరీక్షా ప్రయోగశాలలు (అగ్రిల్యాబ్‌లు) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఎరువులు, పురుగుమందులు నాణ్యతను తెలుసుకునేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను నేరుగా ల్యాబ్‌లకు తీసుకెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో ఏడు నియోజకవర్గస్థాయి ల్యాబ్‌లకు రూ.5.92 కోట్లు, కేంద్రసెంట్రల్ ల్యాబ్‌కు రూ.5.68 కోట్లు కేటాయించి నిర్మాణాలు సైతం పూర్తిచేసి ప్రారంభించారు. ఈ జిల్లాస్థాయి ల్యాబ్‌లో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను పరీక్షిస్తారు. నియోజకవర్గ స్థాయి ల్యాబ్‌ల ద్వారా భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువుల్లో నాణ్యత తెలుసుకుంటారు.

ఇవీ ప్రయోజనాలు..

- పంట కాలానికి ముందే భూసార పరీక్షలు చేయించుకుని ఏ మేరకు ఎరువులు వాడాలో తెలుసుకోవచ్చు. దీని వల్ల ఎకరాకు రూ.2 వేలు నుంచి 3వేలు వరకు ఆదా అవుతుంది.
- తక్కువ ఖర్చు అధిక దిగుబడులకు భూసార పరీక్షా ప్రయోగశాలలు ఏర్పాటుకు దోహదపడతాయి.
- సూక్ష్మపోషకాలు, ధాతుమూలాలు వంటి వాటి నిష్పత్తులను పరీక్షించి ఎరువుల వాడవచ్చు.

నాణ్యత గుర్తించాకే..



విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు అగ్రిల్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి. గతంలో ఏ విత్తనాలు దొరికితే వాటిని వేసి నష్టపోయేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. నాణ్యమైన విత్తనాలు గుర్తించాకే సాగు చేస్తున్నాం.

– గేదెల నాగేశ్వరరావు, రైతు, పాలవలస, పోలాకి మండలం

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో ల్యాబ్ ఏర్పాటుకు 600 చదరపు గజాలు స్థలం కేటాయించారు. జిల్లా కేంద్ర ల్యాబ్‌ను మాత్రం సుమారు రూ.1.10 ఎకరాల స్థలంలో నిర్మించారు. దీనిని గార మండలం అంపోలు వద్ద ఏర్పాటు చేశారు. పలాస, నరసన్నపేట, ఆమదాలవలసలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో, పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరులో వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం వద్ద, ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలంలోని కొండములగాం పంచాయతీలో, టెక్కలి నియోజకవర్గ కేంద్రం, ఇచ్ఛాపురం నియోజకవర్గం సోంపేటలోనూ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

పరీక్షలు ఇలా..



ల్యాబ్‌లో విత్తనాలను పరీక్షిస్తూ..

- ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు నమూనా నాణ్యతను రెండు దశల్లో పరీక్షిస్తారు. మార్కెట్‌లోకి విడుదల కాకముందే కంపెనీలు సరఫరా చేసే ఉత్పత్తులను, డీలర్లు అమ్మకం, స్టాక్ పాయింట్లు వద్ద నుంచి నమూనాలు సేకరిస్తారు. వీటిని జిల్లా స్థాయి ల్యాబ్‌లలో పరీక్షించి ప్రమాణాలకు అనుకూలంగా లేనట్లయితే తిరిగి వెనక్కి పంపిస్తారు.
- మార్కెట్‌లోకి వచ్చాక సరుకుల్లో 5శాతం నమూనాలు మళ్లీ పరీక్షిస్తారు. ప్రమాణాలకు లోబడి లేకపోతే సదరు కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.
- రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలను నేరుగా ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షించుకోవచ్చు. నాణ్యత ప్రమాణాలు లోపిస్తే మండల వ్యవసాయ అధికారి చట్టపరంగా నమూనాలు సేకరించి జిల్లాస్థాయి ల్యాబ్‌కి పంపిస్తారు. .
- ఏకీకృత డిజిటల్ వ్యవస్థలో కంపెనీల ఉత్పత్తులు బ్యాచ్, లాట్‌ల వివరాలు పొందుపరిచి ఆ సమాచారాన్ని సేకరణ బృందానికి అందజేస్తారు. ఈ వ్యవస్థ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు, నమూనా సేకరణ బృందాలు, వ్యవసాయాధికారులు, ల్యాబ్ విశ్లేషకులు, ప్రాంతీయ కోడింగ్ కేంద్రాలు, రైతులు అందరినీ కలుపుతుంది. దీని వల్ల ఏదైనా నమూనా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.

చెప్పారంటే... చేస్తారంటే

రియల్ మేనిఫెస్టో



వైఎస్సార్ సీపీ విధానాలు సంస్కరణల దిశగా వెళ్తున్నాయి. విశాఖకు రాజధానిగా ప్రకటించడం ఆనందదాయకం. ఉత్తరాంధ్ర ప్రజలంతా విశాఖ రాజధాని కావాలని కలలు కంటున్నారు. చంద్రబాబుది కాపీ పేస్ట్ మేనిఫెస్టో. టీడీపీ మాదిరిగా ఏది పడితే అది ఇవ్వలేదు. గతంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం. నేడు అమలు చేయగలిగినవే మేనిఫెస్టోలో పెట్టాం.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసి ఎన్నికల మేనిఫెస్టో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యం కల్పించారు. విద్య, పేదలకు ఇళ్లు, మహిళా సాధికారత, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రైతు భరోసా రూ.16 వేలకు పెంచారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

జగన్‌కు రైతులు రుణపడి ఉంటారు



రైతులకు ఏడాదికి రైతు భరోసా కింద రూ.16 వేలు ఇస్తున్నట్లు ప్రకటించిన సీఎం జగన్‌కు రైతులు రుణపడి ఉంటారు. తండ్రికి తగ్గ కుమారుడు అనిపించుకున్నారు. జగన్ ఏది చెబితే అదే చేస్తాడు. 2014లో మోసం చేసిన చంద్రబాబును రైతులు నమ్మరు.

– వంజరాపు చిట్టయ్య, రైతు, దేవాంగుల వీధి, పాతపట్నం

పింఛన్ పెంపు సంతోషకరం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలో పింఛన్ పెంపుపై ప్రకటన చేయడం చాలా ఆనందంగా ఉంది. జగన్ చెప్పాడంటే చేస్తాడనే నమ్మకం మాకుంది. పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచుతానని ప్రకటించిన విధంగానే అందిస్తున్నాడు. పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.3,500 పెంపుపై ప్రకటన చేయడం చాలా సంతోషం.

– సూరపు వెంకటరావు, పాతహిరమండలం, హిరమండలం మండలం

నిజమైన మేనిఫెస్టో



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో నిజమైంది. జగన్ చెప్పిందే చేస్తారు. కాపు నేస్తం ఇటీవల రూ. 60 వేలు మాత్రమే ఇచ్చేవారు. దీనిని రూ.1.20 వేలకు పెంచారు. ఆనందదాయకంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు మేలు కలగనుంది. జగన్ మాట తప్పని, మడం తిప్పని నాయకుడు. రోజురోజుకీ ఆదరణ పెరుగుతుంది.

– ఇసాయి వెంకటరావు, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ, ఓ.వి.పేట, బూర్జ మండలం

పశువైద్యులే ఆరోగ్య కార్యకర్తలు

- పశువైద్యశాఖ జేడీ కిశోర్



అవగాహన ర్యాలీలో పాల్గొన్న జేడీ కిశోర్

పాతపట్నం: పశు వైద్యుల సూచనలు, సలహాలతో దేశంలో, ప్రపంచంలో పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, మానవాళి ఆరోగ్యానికి పశువైద్యులే ముఖ్యకారకులని జిల్లా పశు సంవర్థకశాఖ సంయుక్త సంచాలకులు (జేడీ) డాక్టర్ మంగిపూడి కిశోర్ అన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా శనివారం పాతపట్నం కోర్టు కూడలిలో ఉన్న పశువైద్యశాఖ ఏడీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ జాతీయ స్థూల ఉత్పత్తి పెరగడానికి పశు సంవర్థక శాఖ ఎంతో కృషి చేస్తుందన్నారు. పశువైద్యులే ఆరోగ్య కార్యకర్తలని పేర్కొన్నారు. పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. టెక్కలి, శ్రీకాకుళం డివిజన్ ఉప సంచాలకులు వి.జయరాజు, ఎం.జగన్నాథం, ఏడీలు యోగి, ఎం.కరుణకరరావు, కిశోర్, లోకనాథం, చంద్రశేఖర్, వైద్యులు శ్రీవాణి, అనిల్‌కుమార్, మౌనిక, శ్రీకాంత్, కిరణ్‌కుమార్, హరికృష్ణ, పాతపట్నం, మెళియాపుట్టి పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



మృతుడు సంతోష్

హిరమండలం: భగీరథపురంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు శనివారం మృతిచెందాడు. పెద్దకిట్టాలపాడుకు చెందిన పాగోటి సంతోష్‌కుమార్(28) తన పెద్దమ్మ చనిపోవడంతో పెద్దఖర్మ నిమిత్తం కొత్తూరు మండలం బలద ఈ నెల 25న వెళ్లాడు. డబ్బులు అవసరం కావడంతో అదే రోజు రాత్రి పెద్ద కిట్టాలపాడు బైక్‌పై బయలుదేరాడు. రాత్రి 2 గంటల సమయంలో భగీరథపురం అమ్మవారి గుడి వద్ద ఆయన ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. అటువైపు వెళుతున్న వారు గుర్తించి 108కు ఫోన్ చేయడంతో సిబ్బంది వచ్చి పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. సంతోష్‌కు భార్య గౌరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.నారాయణస్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమానికి కేరాఫ్ సీఎం జగన్



కొత్తూరు: చింతమానుగూడలో గిరిజన మహిళలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస: వెంగళరావు కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న తమ్మినేని సీతారాం



కొత్తూరు: ఓంద్రుజోలలో ఎమ్మెల్యే రెడ్డి శాంతిని ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి
- ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన



సరుబుజ్జిలి: మతలబుపేటలో కరపత్రం అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కొత్తూరు: కారిగూడలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సరుబుజ్జిలి: చినమతలబుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ సీతారాం

సరుబుజ్జిలి: సంక్షేమ పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోన్‌రెడ్డి విజయానికి అందరూ బాసటగా నిలవాలని శాసనసభ స్పీకర్, ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం కోరారు. మండలంలోని మతలబుపేట, చిన మతలబుపేట గ్రామాల్లో పార్టీ సీనియర్ నాయకులు సనపల తవుడు, వీరఘట్టపు కృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేగా తనను, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు జి.వి.శివానందమూర్తి, లావేటి అనిల్, స్థానిక సర్పంచ్ వీరఘట్టపు జయలక్ష్మి, కొత్తకోట పీఏసీఎస్ అధ్యక్షుడు కొవిలాపు చంద్రశేఖర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, పేడాడ చిరంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రజా ఆమోద పాలన అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలు మద్దతుగా నిలవాలని స్పీకర్, ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ 20వ వార్డు వెంగళరావుకాలనీలో ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు బుడుమూరు శ్రీనివాసరావు, కుప్పిలి సత్యనారాయణ, బి.అజంతాకుమారి, చింతు విజయ, బి.సూర్యారావు, ఎ.ఉమామహేశ్వరారవు, పి.శ్రీనివాసరావు, దుంపల శ్యామలరావు, పొన్నాడ చిన్నారావు, మామిడి రమేష్, ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గిరిజనులకు న్యాయం జరిగిందని పాతపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కారిగూడ, శ్రీరాములుగూడ, చింతమానుగూడ, ఓంద్రుజోలలో ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ గిరిజనలకు అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, పేరాడ తిలక్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ సర్పంచ్ లోది, నాగేంద్ర, ఎంపీపీ సవర సావిత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ గోగులు వరప్రసాదరావు, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బూర్జ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్పీకర్ తమ్మినేని సీతారాంను ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యేగా, పేరాడ తిలక్‌కు శ్రీకాకుళం ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ కోరారు. మండలంలోని తుడ్డలి, హరిపురం, పల్లాపురం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హిరమండలం: వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ యువ నాయకులు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు ఓం శ్రీకృష్ణ అన్నారు. హిరమండలంలోని అంధవరపు వీధిలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గూర్చి వివరించారు. పాతపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న రెడ్డి శాంతిని, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, పార్టీ నాయకులు అంధవరపు శ్రీనివాసరావు, ఎండవ ప్రసాద్, శంకర్‌రావు, ఉప సర్పంచ్ వెలమల బాలరాజు, నక్క ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: వెంగళరావు కాలనీలో డ్యాన్స్ చేస్తున్న యువకులు



హిరమండలం: అంధవరపు వీధిలో ప్రచారం నిర్వహిస్తున్న ఓం శ్రీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు



బూర్జ: తుడ్డలిలో ప్రచారం నిర్వహిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఏపీఎస్ఎస్‌టీఎఫ్ అధ్యక్షుడిగా కేశవరావు

హిరమండలం: సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అధ్యక్షుడిగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తులగాపు కేశవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం శ్రీకాకుళంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇతర కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కేశవరావును ఎంఈఓ రాంబాబు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

డిగ్రీలో ప్రవేశాలకు హెల్ప్‌డెస్క్

పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరనున్న విద్యార్థులకు హెల్ప్ డెస్క్‌ను శనివారం ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.ఉదయ్ లక్ష్మి తెలిపారు. విద్యార్థులు ఏ కోర్సుల్లో చేరాలి, ఏయే ధ్రువపత్రాలు ఉండాలి, దరఖాస్తులు ఎలా చేయాలి వంటి విషయాలపై హెల్ప్ డెస్క్‌లో అవగాహన కల్పిస్తారని చెప్పారు. కళాశాలలో ఉన్న హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ నెల 29 నుంచి డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29 నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. వర్సిటీలో శనివారం వివరాలు వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29 నుంచి మే 16 వరకు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. రెగ్యులర్‌గా 9129, సప్లిమెంటరీలో 8320 మంది హాజరు కానున్నారు. 4వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు పరీక్షలు ఉంటాయి. రెగ్యులర్ విద్యార్థులు 7100 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 8151 మంది హాజరు కానున్నారు. 62 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 12, 13, 14 తేదీల్లో సెలవులు ఉంటాయని పేర్కొన్నారు.